

ఎమ్మెల్యే రమణమూర్తిని కలిసిన సీఐ బృందం

విశాలాంధ్ర - నరసన్నపేట : నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తిని శుక్రవారం రాత్రి సర్కిల్ ఇ న్స్పెక్టర్, జె.శ్రీనివాసరావు నాలుగు మండలాల ఎస్.ఐలతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా వారు ఎమ్మెల్యేకు క్రోటన్ మొక్కను అందచేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి వారితో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుంటూ నియోజకవర్గంలో శాంతి, భద్రతలు అదుపులో వుండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, నా గౌరవాన్ని, మీ గౌరవాన్ని పెంచేలే విధులు నిర్వ హించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసన్న పేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఎస్.ఐలు, సిహెచ్. దుర్గాప్రసాద్, జి.రంజిత్, బి.అశోక్‌బాబు, బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా నియోజకవర్గంలోని ప్రజలు శిథిలమైన, పాత ఇండ్లలో ఉండవద్దని సూచించారు. వర్షాల కారణంగా గోడలు, శ్లాబులు కూలి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. అదే విధంగా చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీరు అధికంగా చేరడంతో స్నానాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు తీసుకు వెళ్లవద్దని తెలిపారు. అలాగే పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపర్లు జాగ్రత్త ఉండాలని వివరించారు. అలాగే గార, రూరల్ మండలాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ల వద్దని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా కాచి వడబోసిన నీటిని తీసుకోవాలని చెప్పారు. అలాగే ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. రోగాల బారిన పడిన వెంటనే అలసత్వం వహించకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించి మెరుగైన వైద్యసేవలు పొందాలని చెప్పారు. వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తూ ప్రజారోగ్యం రక్షణకు శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే నగర పరిధిలో వర్షాల కారణంగా కాలువల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు.

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సంఘటనపై పూర్తి స్థాయి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి

పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ డిమాండ్

విశాలాంధ్ర - పలాస : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హీడెన్ కెమెరాల విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యు)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు తీవ్ర ఆందోళన గురి చేసిందని, దేశంలో విద్యార్థినిలకు, మహిళలకు రక్షణ కరువ వుతు ందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలు రికార్డు చేయబడ్డాయని అనుమానాలను కూడా ఆ కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు లేవనెత్తారని వీటి పై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశా రు. విద్యార్థినీలను, స్త్రీలను వ్యాపార వస్తువుగా మార్చుతున్న విష సంస్కృతికి మూలాలైనా అశ్లీల చిత్రాలు, సాహిత్యం, సినిమాలు, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తుందన్నారు.

రహస్యంగా వీడియోలు తీసిన వారిని కఠినంగా శిక్షించాలి

పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ

విశాలాంధ్ర - పలాస : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన దుర్మార్గమైన చర్యలో పాల్గొన్న నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవ హరించిన కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలను తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీ ఓ డబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేసారు.శనివారం పలాస మండలం బొడ్డపాడు గ్రామంలోని పిఓడబ్ల్యూ కార్యాలయంలో సంఘం జిల్లా నాయకులు కుత్తుం హేమక్క బర్ల జానకమ్మలతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కళాశాల వసతి గృహంలో రహస్యంగా హిడెన్ కెమెరాలను అమర్చి అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన అత్యంత దుర్మార్గమన్నారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్న యాజమాన్యం వసతి గృహల్లో సరైన పర్యవేక్షణ చేయడం లేదన్నారు. ముందస్తు సమాచారం వున్నా కూడా యాజమాన్యం స్పందించలేదన్నారు. యాజమాన్యం పై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.కోల్ కత్తా ఘటన మరువకముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటువంటి దారుణమైన ఘటన జరగడం అమానుషమన్నారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో నిజానిజాలను వెలుగులోకి తీసుకు రావాలని కోరారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని, కళాశాల యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ భరోసా నిరుపేదలకు అండ : ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ పేదల జీవితాల్లో ఆనందం నింపుతుందని, స్వయంగా ఫించన్ దారులను కలసి వారికి ఫించన్ అందజేయడం వారి కళ్లలో వ్యక్తం అయ్యే సంతోషం వెలకట్ట లేనదని, దీనికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పేర్కొన్నారు. మూడో విడత పెన్షన్ పంపిణీ లో భాగంగా నియోజకవర్గంలో నాలుగు మండలాలలో పలు పంచాయతీ లలో ఫించన్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారి సాధక బాధకాలు స్వయంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపించేలా తక్షణ చర్యలకు ఆదేశాలు ఇవ్వడంతో, నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు ఎమ్మెల్యేగా రావడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ భరోసా అతిపెద్ద సంక్షేమ పథకం : ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - కొత్తూరు : తెలుగు దేశం పార్టీ ప్రతిష్ఠత్మకమైన హామీలలో ఒకటైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అతిపెద్ద సంక్షేమ పథకం అని పాతపట్నం ఎంఎల్ఏ మామిడి గోవిందరావు అన్నారు మండలం ఒంద్రుజోల గ్రామంలో పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం ఓండు జోల గ్రామంలో ఎన్.టీ ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు . గత ప్రభుత్వం అప్పట్లో పెంచిన పెన్షన్ మూడు వేల రూపాయలు కు చేరడా నికి ఐదు ఏళ్ళు సమాయం పట్టింది తమ ప్రభుత్వం 4 వేలు రూపాయలు కు పెంచడానికి ఒక్క క్షణం పట్టింది .అని ఎంఎల్ఏ మామీడీ అన్నారు. ప్రజలు గతప్రభుత్వానికి సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని అన్నారు. పెన్షన్ సొమ్ములు డ్రా కోసం నెలాఖరుకు బ్యాంక్‌లు చుట్టూ సచివాలయాలు సిబ్బంది పేదే పదే తిరుగే వారు.అని అన్నారు నేడు ఆ పరిస్థితి లేదు. అన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఆరు నెలలులోగా నెరవేరుస్తామని ఏం.ఎల్.ఏ మామిడి గోవిందరావు అన్నారు కాగా అంతక ముందు. కార్యక్రమానికి వస్తున్న ఎంఎల్ఏ మామిడి కి గ్రామ ప్రవేశంలో ఒంద్రు జోల గ్రామ సర్పంచ్ గంధవరపు ఈశ్వరి ఆమె ప్రతినిధి జి.నాగేంద్ర, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వర ప్రసాద్‌రావు, ఏం.పి. డీ ఓ పావని. సామాజికవేత్త భామిడీ రాజు టీడీపీ నేతలు మా తల గాంధీ, ఏ.అరుణ కుమార్. ఏ.మాధవ్‌రావు ఏ.దశరథ రావు తదితరులున్నారు.

జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో జిల్లా ఆసుపత్రిని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రావివలస పెన్షన్ పంపిణీ కార్య క్రమం నుండి తిరిగి వెళుతుండగా ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మిక తనిఖీ చేసినట్లు తెలిపారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులకు అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఓపి విభాగానికి వెళ్లి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారని, ఈరోజు ఎంతమంది వచ్చారని సిబ్బందికి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అంతా పరిశీలిస్తూ పలు ఓపి విభాగాలలో ఉన్న వైద్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకొని, తమ తమ వార్డుల్లో వైద్యులు ఎప్పుడూ రోగులకు అందుబాటులో ఉండాలని, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నేరుగా రోగులు వద్దకు వెళ్లి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, వీల్ చైర్లు, లిఫ్టు తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆసుపత్రి సూపరిండెంట్ బి సూర్యారావు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆకస్మాత్తుగా అచ్యుతాపురం పిహెచ్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర - జలుమూరు : మండలం అచ్యుతాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శనివారం ఆకస్మికంగా తనకి నిర్వహించారు. ముందుగా ఓపి రిజిస్ట్రేషన్ ఇబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులు పట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా వైద్య సేవలు అందు బాటులో ఉండేలా చూసుకోవాలని వైద్య సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి ని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమావేశం హాలు లేబరేటరీ గది విస్తరించాలని ఆమె తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కరి స్తానని ఎమ్మెల్యే రమణమూర్తి సిబ్బందికి హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు చంద్రభూషణ, మునుకోటి దామోదర్ రావు, సర్పంచ్ బగ్గు గోవిందరావు, పంచెరెడ్డి రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నిల్వపై మంత్రి ఆగ్రహం

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక ప్రధాన రహదారి పై చెత్త నిల్వపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం రావివలస పంచాయతీలో పలు కార్యక్రమాల నిమిత్తం హాజరవుతున్న మంత్రి స్థానిక రవీంద్రభారతి పాఠశాల రహదారి పై కుప్పలు కుప్పలుగా ఉన్న చెత్తను చూసి కన్వే ను నిలుపుదల చేసి క్రిందకిదిగారు. ప్రధాన రహదారి ముందు భాగంలో ఇంత చెత్త ఉండడం, రోడ్లపై పశువులు ఉండడం సరికాదని ఆ చుట్టుపక్కలంతా పరిశీ లించారు. వెంటనే పంచాయతీ అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కార్మికులు పై వెంటనే చర్యలు తీసుకోమని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం అయితే అధికారులు పై చర్యలు తీసుకుంటానని హెచ్చరించి, తక్షణమే శుభ్రపరచమని ఆదేశించారు. ఇంటింటికి చెత్త బళ్ళు వెళ్లి చెత్త సేకరణ చేయాలని, ఇలా రోడ్లపై చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో ఉన్న ప్రతి సమస్యపై నిఘా పెడతానని, రోడ్లపై చెత్తను, కాలు వాలలో పూడిక ఎప్పుడుకప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

కంచిలిలో ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి : కంచిలి మండలంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ శనివారం ఏర్పాటైంది. స్థానిక మార్కెట్ యార్డులో ఇచ్ఛాపపురం నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. గౌరవ సలహా దారుగా ఎం.జోగారావు, గౌరవ అధ్యక్షుడుగా ఎం.మన్మధ రావు, అధ్యక్షుడుగా డి.జగ్గారావు, ఉపాధ్యక్షునిగా కె.రాజు, ప్రధాన కార్యదర్శి పి.మోహనరావు, కోశాధికారిగా యు.రవి, కార్యదర్శిగా బి.చంద్రయ్య ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర - సోంపపేట : సోంపేట మండలం పొత్రఖండ గ్రామంలో వైసీపీ నాయకుడు ధర్మారావు తల్లి ఇటీవల మరణించింది. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీటీసీ ప్రతినిధి తడక జోగారావు, కంచిలి జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇచ్చే బాధ్యత మాది

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - టెక్కలి : అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వముదని అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని రావివలస గ్రామంలో నూతనంగా 40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, 22 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, 17.50 లక్షల నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గోపూజ, గోవులకు టీకాలు నిర్వహించారు. అనంతరం, గ్రామంలో ఉన్న ప్రతి గడప గడపకు స్వయంగా మంత్రి వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వృద్ధులు, వికలాంగులను ఆప్యాయంగా పలకరించి, అర్హులైన పెన్షన్‌దారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అచ్చన్న మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నంగా ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేసి 90 రోజులు అవుతుందని, ఇచ్చిన మాటకు కట్టుబడి వరుసగా హామీలు నెరవేరుస్తున్నామని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియాల్సి ఉందని అన్నారు. వాలంటీర్లు కంటే ముందుగానే గ్రామ సచివాలయ ఉద్యోగులతో పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 1వ తేదీన ఆదివారం వచ్చినందువలన అధికారులకు ఇబ్బంది లేకుండా ముందు రోజే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే రావివలస కి ముఖ్య ప్రధానమైన సమస్య టెక్కలి నుంచి రావివలస కు వచ్చే రహదారిని మంజూరు చేస్తామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని రావివలస గ్రామానికి ఎంతో పేరు ప్రఖ్యాతులను తెచ్చినటువంటి ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి గతంలో కొన్ని నిధులు మంజూరు చేశామని, దేవాదాయ శాఖ అధికారులను పిలిపించి వారితో చర్చించి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూలపేట పోర్ట్‌ను శరవేగంగా పూర్తి చేస్తామని, మూలపేట నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతం రహదారులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. మాజీ జడ్పిటిసి ఎల్ఎల్ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా సిసి రహదారులు, గృహ లేని వారికి గృహాలు, కాలువలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతి ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుదర్శన్ దొర, ఇన్చార్జి డిపిఓ వెంకట్ రమణ, తహసిల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, గ్రామ పంచాయతీ అధికారి జగన్నాధరావు, ఎంపీపీ సరోజనమ్మ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజిరాపు హరి వరప్రసాద్, మాజీ ఎంపీపీ సుందరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి జయరాజ్, వివిధ అధికారులు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, టిడిపి నాయకులు మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవ కుమార్, మహిళా అధ్యక్షులు మొండి దమయంతి, బీసీ సెల్ అధ్యక్షులు ఇప్పిలి జగదీశ్వరరావు, మట్ట పురుషోత్తం, రొయ్య ప్రీతిష్ చంద్ర, లాడి శీను, దుర్గారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ దారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాను పట్ల అప్రమత్తం... కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్ప పీడనం వాయుగుండంగా మారి శనివారం అర్ధరాత్రి తీరం దాటనుండటంతో భారీ వర్షాలు, కురిసే ఛాన్స్ ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ముందస్తు చర్యలలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి శనివారం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలసి మాట్లాడుతూ భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా దండోరా వేయించామని, అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, ముఖ్యంగా నాగావళి, వంశధార ప్రధాన నదీ పరివాహక ప్రాంతాలలో యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది అందరూ అందు బాటులోనే ఉన్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామని, తుఫాను, ఇతర భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ నెం:08942-240557 కు ఫోన్ చేయాలని, అలాగే ఈమెయిల్ ఐడీ (కోశ్రీకాకుళం సూపర్డెంట్‌ఎట్‌జీమెయిల్‌డాట్ కాం) ద్వారా ఫోటోలను పంపించాలని తెలియజేశారు. 08942- 240557 నెంబర్ కు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని, సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారని అన్నారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తాసీల్దార్లకు సూచించారు. వైద్య-ఆరోగ్య శాఖ, విద్యుత్, రహదారులు భవనాలు, ఎస్.ఇ. ఆర్.డబ్ల్యూ. ఎస్ అధికారులు సిబ్బంది ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ స్థంబాలు ఇతర సామగ్రితో తుఫాన్ ప్రభావిత మండలాలలో సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో 108 వాహనాలు, ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.టి.ఆర్.ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. జనరేటర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ల ను ఆదేశించినట్లు, తుఫాన్ ను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసామని, ప్రజలు భయపడకుండా జాగ్రత్తగా ఇళ్ళల్లోనే ఉండాలన్నారు. తుఫాను సహాయక చర్యలను పర్యవేక్షించడం కోసం తీర ప్రాంత మండలాలకు 11 మంది ప్రత్యేక అధికారులను నియమించమని కలెక్టర్ తెలిపారు.

హరిత సిక్కోలును నిర్మించుకుందాం

జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : హరిత సిక్కోలు కోసం అందరమూ అడుగువేద్దామని ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. జన సేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు సాధనలో భాగంగా వనమహోత్సవం పేరిట నగరంలోని సూర్యమహల్ కూడలిలో 500 మొక్కలను శనివారం పంపిణీ చేశారు. అలాగే యువతకు టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి దానిని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. వాహన వినియోగం పెరిగిపోవడం, గ్లోబల్ వార్మింగ్ వల్ల వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు అలాంటి ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. క్షణం తీరిక లేకుండా ఒత్తిడితో సహవాసం చేసే సగటు నగరజీవులకు ఈ పర్యావరణ రక్షణ పట్ల మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆకుపచ్చని తోరణంగా తీర్చిదిద్దుదాం. బాధ్యతగా మొక్కలు నాటుదాం.. వాటిని సంరక్షిద్దాం.- అని పిలుపునిచ్చారు. వనమహోత్సవం ఓ బృహత్తర, మహత్తర కార్యక్రమం అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తన పుట్టినరోజును పురస్కరించుకొని క్లీన్ ఆంధ్రా- గ్రీన్ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. ఆకుపచ్చని ఆశయాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోడ్పడతానని, పచ్చని చెట్టు.. ప్రగతికి సోపాన మార్గమని గుర్తెరిగి. ప్రకృతిలోని సమతులస్థితి అవసరాన్ని గుర్తిస్తూ.. ప్రతి నీటి బొట్టును సద్వినియోగ పరుస్తానని, చెట్ల ఆవశ్యకత పట్ల అవగాహన పెంచుతూ వనాలను నరకనని, నరకనివ్వనని, విరివిగా మొక్కలు నాటుతానని, ఊరూ.. వాడా.. ఇంటా.. బయట అన్ని చోట్ల మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా స్వీకరిస్తామని జనసైనికులు, ప్రజలతో డాక్టర్ దానేటి శ్రీధర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని జనసేన పార్టీ వీరమహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ఆశయాలను నేరవేర్చేవిధంగా జనసేన సైనికులు, నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ సర్వేశ్వరరావు, గురుప్రసాద్, ఉదయ్,మణి,అర్జున్, కామేష్, మోహనలక్ష్మి,జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుని ఇంటి వద్దే పింఛను అందజేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలం పొన్నాడ, బింగుపేట, కమ్మవానిపేట గ్రామాల్లో పింఛను పంపిణీ తీరును ఆయన శనివారం పరిశీలించారు. ప్రతి లబ్ధిదారునికి పింఛను అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. భాస్కరరావు, నారాయ ణవరం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే .స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు ఇబ్రహీంబాద్, పూడివలస గ్రామాల్లో పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఎంపురంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరుద్యోగులకు హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలో భాగంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలం ఇబ్రహీంబాద్ గ్రామంలో మాజీ సైనికులు నిర్మించిన గ్రంథాలయంలో శ్రీకాకుళం బ్రహ్మర్షి సంస్థ సరఫరా చేసి డీఎస్సీ స్టడీ మెటీరియల్స్‌ను అభ్యర్థులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కూలమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఈ నియోజకవర్గంలో ఇటీవల జాబ్ మేళాలు నిర్వహించి 550 మంది ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మాజీ సర్పంచ్ వావిలపల్లి రామస్వామి, విశ్రాంత ప్రిన్సిపాల్ వి.నారాయణ స్వామి పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంపై అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర - సోంపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం శనివారం సాయంత్రం తీరం దాటుతున్న సమయంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.కె.వి.సత్యనారాయణ స్థానిక అధికారులతో సమీ క్షించారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వి. రమణ, ఎఓ జగ్గారావు, వెలుగు, ఉపాధిహామీ, గృహనిర్మాణశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన అందించడమే ధ్యేయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలోని కిష్టప్పపేటలో శనివారం అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజల్లో ఆనందం కన్పిస్తోందని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతీ నెల 1వ తేదీన పింఛన్లను పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు ప్రతీ నెల పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. సీఎం జగన్‌మోహనరెడ్డి పింఛన్లు పూర్తిస్థాయిలో అందిస్తామని చెప్పి ఏడాదికి రూ.250 అందించి వారిని మోసం చేసిందన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఒకేసారి వారి పింఛన్‌ను రూ.నాలుగువేలకు పెంచి వృద్ధులకు భరోసా కల్పించారని తెలిపారు. అవ్వాతాతలకు ఆదుకునేది సీఎం చంద్రబాబునాయుడేనని మరోసారి రుజువైందన్నారు. పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఒకవైపు సంక్షేమం అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి కూడా శరవేగంగా సాగుతోందన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి దొరికిందని చెప్పారు. పింఛన్ల పంపిణీలో శ్రీకాకుళం నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం గొప్పవిషయమని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతి కార్యాలయం, నరసన్నపేట

రేఖా నెం.183/2024-బి

తేది:30-08-2024ది

టెండరు నోటీసు

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, నరసన్నపేట గ్రామ పంచాయతి నందు దిగువ నుదహరించిన షెడ్యూలు-1 నందు చూపబడిన సామగ్రి 2024-2025 ఆర్థిక సంవత్సరము కాలము నందు సప్లయి చేయుటకు టెండర్లు నిర్వహించబడును. టెండరు దాఖలు చేయువారు టెండరు ధరావత్తు చెల్లించి తే:06-09-2024ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును.. స్వీకరించబడిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.3-00లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును మరియు షెడ్యుల్ టెండరుదారులు టెండరు షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యులు -1 (టెండరు)

వ.నెం పని సామగ్రి వివరములు	ఆర్థిక సంవత్సరము	సప్లయిచేయు కాలము	చెల్లించవలసిన టెండరు ధరావత్తు
1) Fogging Milathin Oil	2024-2025సం,,	15 రోజులు	రూ.500/-

టెండర్లు ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిద వేయుటకు గాని, తిరస్కరించుటగాని, పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతీకి, అందులకు సంబంధించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు, ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను

సం,,పల్లి ద్రాక్షాయణి, కార్యనిర్వహణాధికారి
పంచాయతి కార్యదర్శి, గ్రామ పంచాయతి
నరసన్నపేట

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని నెలవంక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నెలవంక గ్రామంకు చెందిన వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు దువ్వు కృష్ణారెడ్డి భార్య భూదేవి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. అలాగే వైఎస్ఆర్సిపి సీనియర్ నాయుకుడు చిట్టిబాబు తండ్రి ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు దువ్వు కృష్ణారెడ్డి కుటుంబాన్ని, చిట్టి బాబు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఈయనతో పాటు వైసీపీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, చందాన పూర్ణచంద్రుడు, వైసీపీ నాయకుడు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ వేయరూ...

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : గతంలో వేసిన స్పీడ్ బ్రేకర్స్ ఊడిపోయినందున పాదాచారులు స్కూళ్ళకి సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు అతివేగంతో వస్తున్న వాహనాల వలన ఇబ్బం దులు పడుతున్నారు. కిమ్స్ హాస్పిటల్ రోడ్‌లో ఉన్న పీ.ఎస్ కాలనీ నుండి భైరవానిపేటకి వెళ్లే జంక్షన్ చాలా రద్దీగా ఉండే రోడ్డు అయినందున అతివేగంతో వస్తున్న వాహనాల వలన యాక్సి డెంట్లు అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఈ జంక్షన్లో ఇరువైపులా స్పీడ్ బ్రేకర్స్ అమర్చాలని కోరుతున్నారు.

అకౌంట్‌లో జీతాలు వేసేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కవిటి : కాంట్రాక్టర్ పద్ధతి ద్వారా కాకుండా నేరుగా విద్యుత్ శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల ఖాతా ద్వారా జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఏపీ ఈపీడీసీఎల్ డిఈ యోగేశ్వర రావుని విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ సభ్యులు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ సెక్రటరీ దుగాన భాస్కర్ తోపాటు సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా తమ ఆకౌంట్లో జీతాలు వేస్తున్నారని అలా కకుండా నేరుగా విద్యుత్ శాఖ ద్వారా తమ జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ సభ్యులు గొనప ఆనంద్ కుమార్, కాంట్రాక్టర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ పరిశ్రమలో శిక్షణకు ఆకర్షణీయమైన స్టయిఫెండ్

విశాలాంధ్ర - పొందూరు : పొందూరు ఖాదీ పదికాలాలపాటు బతికిం చేందుకు గాను ఖాదీ, చేనేత కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు శిక్షణనిచ్చేందుకు నమూనా సర్వే జరుపుతున్నట్టు లీడర్ పీపుల్స్ సంస్థ నిర్వాహకులు వి.వి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 25మందికి శిక్షణనిచ్చి ఆకర్షణీయమైన స్టయిఫెండ్ చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానికులకు మాత్రమే ఈ అవకాశం. వివరాలకు సెల్ 94905 28730ను సంప్రదించాలని కోరారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న విధంగా పింఛన్ కోసం యోచిస్తున్న అనేకమంది బీద లబ్ధిదారులకు అనుకున్న విధంగా పించలను అందిస్తున్న ఘనత తెలుగుదేశందేనని శాసనసభ్యులు బగ్గు రమణ మూర్తి అన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆదివారం సెలవు దినం అయినప్పటికీ ముందు రోజు అందించిన ఘనత ప్రభుత్వం దేనని ఆయన అన్నారు. జలుమూరు మండలం శ్రీముఖ లింగం గ్రామంలో శనివారం ఇంటింటా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, నియోజకవర్గ అబ్జర్వ్ మండల అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాంబాబు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మున్సిపాలిటీకి సంబంధించిన కేసులు విచారించడానికి అవసరమైన న్యాయవాది నియామకానికి మున్సిపాలిటీ ధరఖాస్తులు ఆహ్వానించగా ఆరుగురు న్యాయవాదులు తమ వివరాలు పొందుపరిచారు. మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ సమన్వయంతో శనివారం నిర్వహించిన సమావేశంలో సదరు అంశాన్ని చర్చించి మొగల్ల రాంబాబును ఎన్నుకున్నారు. రాంబాబు ఎంపిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతు మున్సిపాలిటీ కేసుల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తనను ఎంపిక చేసినందుకు కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబానికి పరామర్శించిన ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు : ఇటీవల కాలంలో అనకాపల్లి జిల్లాలో ఫ్యాక్టరీలో జరిగిన ఘోర ఫైర్ ప్రమాదంలో మృతి చెందిన హంస ప్రశాంత్, దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న టిడిపి కార్యకర్త అప్పలనాయుడు కుటుంబాలకు ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం పరామర్శించారు. విన్నవయసులోనే ప్రశాంతును కోల్పోవడం దురదృష్టంగా భావించారు. బిడ్డల కూల్పోయిన బాధతో తల్లి పడుతున్న బాధలను ఎమ్మెల్యే రవికుమార్ చూసి ఓదార్చారు. ప్రశాంతి పిల్లల ఇద్దరూ చిన్నవారు కావడంతో తండ్రి లేని లోటును అమ్మమ్మగా పెద్ద మనసు చేసుకొని చూసుకోవాలని ఓదార్చారు. ప్రశాంత్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రమాద విషయంపై పూర్తిస్థాయిలో ఆరా తీసి కుటుంబానికి ఉపయోగపరంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగురిపల్లి రామ్మోహన్రావు, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, బాడన శేషగిరి నాయుడు, మద్దిల శ్రీనివాస రావు, పుంద్రు లక్ష్మి, దండా రవికుమార్, ఎంపీటీసీ వాణి, అనకాపల్లి కృష్ణ పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

తహసిల్దార్ మురళీమోహన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర - కవిటి : అల్పపీడనం తీరం దాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీసే అవకాశం ఉందని ప్రజలంతా పక్కా భవనాల్లో ఉండాలని తహసిల్దార్ బి మురళీమోహన్ రావు, ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఇద్దివాని పాలెం, చిన్నకర్రివాని పాలెం, పెద్దకర్రివాని పాలెం తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఎవరు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీరు మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కే.రాము, ఈవోపీఆర్డి శివాజీ పాణిగ్రహి, సీనియర్ సహాయకులు రమణ మూర్తి, పంచాయతీ కార్యదర్శి నిమ్మన గుణవతి, వీఆర్వో గుర్రాల దివాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని ఇద్దీవానిపాలెం గ్రామంలో 50 మంది నిరుపేదలకు యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాంబాబు (న్యాయవాది) ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం 50 మంది నిరుపేదలకు 10 కిలోలు బియ్యం తోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, సముద్రంలో వేటకు వెళ్ళేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, కిడ్నీ వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్సకో ఏఈ సుగ్గు హరీష్, పాతిన వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధి హను మంతు, రామయ్య, గ్రామస్తులు అప్పన్న, కర్రీ శాంతయ్య, నేతాజీ, కుర్మారావు, ఎం సోమేశ్, బైరి, కత్తుల శ్రీను, ఆశ కార్యకర్త కర్రీ లక్ష్మి, అంగనవాడి కార్యకర్తలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ విద్యుత్తు లైన్ మ్యాన్‌కు గాయాలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం పరిధిలో కాంట్రాక్ట్ లైన్ మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న బొమ్మాలి బాలరాజు అనే యువకుడు శనివారం చిన్న బజారు కూడాలి సమీపంలో విద్యుత్తు దీపాలు మరమ్మత్తులు చేస్తుండగా కరెంటు షాక్ తగిలి, కాలు జారీ స్తంభం పై నుండి కిందకి పడ్డాడు. నేరుగా కిందకి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న యువకుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి స్థానికులు తరలించారు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్స చేస్తూ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆక్సిజన్ సహాయముతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాలరాజుకు 18 నెలల కుమార్తె, భార్య ధనలక్ష్మి ఉన్నారు. వారి కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకొని బాలరాజు పరిస్థితులను చూసి బాధతో గుండెలు బాదుకొంటూ కన్నీమున్నేరుగా విలపిస్తున్నారు. విద్యుత్తు సిబ్బందికి సరైన విద్యుత్తు రక్షణ పరికరాలు హెల్మెట్, చేతి గ్లౌజులు, కాలికి బూట్లు లేకపోవడమే ఇంతటి ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు అంటున్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలి : వైద్యాధికారి వంశీకృష్ణ

విశాలాంధ్ర - జలుమూరు : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలు మూరు ప్రాథమిక వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. శనివారం చిన్న దూగాం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఎన్ని సేవలు అందించిన ప్రజలు పరిశుభ్రత పాటించాలని భోజనం ముందు చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలని వేడి పదార్థాలు భుజించి వేడి నీళ్ల ని వినియోగించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో మలేరియా డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అన్ని బావుల్ క్లోరినేషన్ చేయించారు. ఆయనతోపాటు సర్పంచ్ పీస పద్మావతి, వైద్యాధికారి వంశీకృష్ణ, ఆరోగ్య కార్యకర్త సత్యవతి, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, వెంకట్రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం ఆకులతంపర వంశధార నది ఒడ్డున గల అక్రమ ఇసుక క్వారీ నుండి అక్రమగా లారీలు తో రాత్రి వేల విశాఖ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు అంటూ స్థానికులు కొందరు సదరు లోడ్ లారీలను అడ్డుకున్నారు కాగా ఈ సామాచారన్ని జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఏం.ఎల్.ఏ కలమట వెంకటరమణ మూర్తికి చేరడం తో శనివారం ఉదయం ఆకులతంపర గ్రామం చేరుకున్నారు. అక్రమ ఇసుక లోడ్ లారీలను తాము అడ్డుకున్న విషయాన్ని గ్రామస్తులు కలమటకు వివరించారు ఈ అక్రమ క్వారీ నుండి ఒడిస్సా క్వారీల పర్మిట్‌లతో ఇసుకను. పట్నాలకు లారీలతో తరలుతుందని. లోడ్ లారీలు, జేసిబిలను సీజ్ చెయ్యాలని అక్కడ నుండే జిల్లా అధికారులకు మాజీ ఎమ్మెల్యే కలమట ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గత కొన్ని రోజులుగా ఈ అక్రమ ఇసుక తరలింపు వ్యవహారం సాగుతుంది అని అధికారులు చర్యలు తీసుకోవాలని ఇసుక లోడ్ లారీలను పట్టుకున్న గ్రామస్తులు కోరుతున్నారు.

కొర్ను కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం కృష్ణ దాస్

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు మండలం ఎలమంచిలి గ్రామంలో ఇటీవల మరణించిన కొర్ను రాము సత్యం కుమారుడు కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ శనివారం పరామర్శించారు. ఆయనతోపాటు మండల అధ్యక్షులు వాన గోవి, మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, జె సి ఎస్ కన్వీనర్ ధర్మాన జగన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు పైడి విట్టల్ రావు, మన్మథరావు, పోలాకి ఎంపీపీ ముద్దాయిడ బైరాగి నాయుడు, సర్పంచులు రవి, చల్ల రామ్మూర్తి నాయుడు, చంచల జోగారావు, రామకృష్ణ, ఆదినారాయణ, శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

జాబ్ మేళా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి శాఖ వారి ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా "జాబ్ మేళా" కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శ్రీకాకుళం లో 03-09-2024 మంగళవారం ఉదయం 9.30 గం.ల నుంచి నిర్వహించ బడును. ఈ ఉద్యోగ మేళాలో 9 స్థానిక మరియు బహుళజాతి కంపెనీలు పాల్గొని అర్హత మరియు ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుంది. అదే విధంగా ఈ ఉద్యోగ మేళా లో 6 కంపెనీలు కేవలం (పి/ఎల్‌డి, ఎల్‌డి (లోకోమోటార్స్) దివ్యంగులు అయినటువంటి అర్హత మరియు ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశం తో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుంది. కావున అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి వారి విద్యార్హత పత్రాలు నకలు, సదరం సర్టిఫికెట్(దివ్యంగులకు మాత్రమే), ఆధార్ కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరయ్యి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరడమైనది మరిన్ని వివరాలకు 9550967353, 8317652552 నెంబర్లు సంప్రదించగలరు. రిజిస్ట్రేషన్ కొరకు (స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్) వెబ్ సైట్ ను సందర్శించి రిజిస్టర్ చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి. సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

యూనియన్ బ్యాంకుతో టయోటా కిర్లోస్కర్ మోటార్స్ భాగస్వామ్యం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) నేడు వినియోగదారులకు సమ గ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుంది. కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీ యమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం అని టొయోటా కిర్లోస్కర్ మోటర్ సంస్థ యొక్క సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నామన్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సంవత్సరానికి 8.80 శాతం నుండి ప్రారంభమయ్యే ప్రస్తుత వడ్డీ రేట్లతో 84 నెలల వరకు సౌకర్యవంతమైన ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు అన్నారు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా వాహన ఫైనాన్సింగ్ అవకాశాలను పెంపొందించడం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకున్నామని చెప్పారు. ఈ భాగస్వామ్యం ద్వారా టయోటా వాహనాన్ని గ్రామీణ సెమీ అర్బన్ ప్రాంతాలలో ఎక్కువ మంది కస్టమర్‌లకు చేరువ చేయడం తమ లక్ష్యం" అని అన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం కొర్లాం గ్రామంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయకులపై అవగాహన కల్పించారు. పర్యా వరణానికి హాని చేసే రసాయనిక విగ్రహాలు వాడవద్దని జాగృతి అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి పేర్కొన్నారు. పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలు తయారు చేసి పూజలు చేయాలని సూచించారు. విద్యార్థులకు మట్టి వినాయకులు పంపిణీ చేశారు.

వయ్యారిభామతో జీవ వైవిద్యానికి తీవ్ర నష్టం

బ్రాహ్మణతర్లా హైస్కూల్‌లో అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర - పలాస : ఎన్ని సార్లు పీకినా మళ్లీ మళ్లీ పెరిగి, వదలని వయ్యారిభామ కలుపు మొక్కలు వలన స్థానిక మొక్కల వైవిద్యానికి తీవ్ర నష్టం జరుగుతుందని బ్రాహ్మణ తర్ల హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు ఎస్.వి. రమణ రావు అన్నారు. శనివారం వయ్యారిభామ అవగాహన వారోత్సవాలు సందర్భంగా హైస్కూల్లో ప్రత్యేక లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ ల ఆధ్వర్యంలో విద్యార్థులు వయ్యారిభామ - వదలదు మామ అనే నినాదం తో పాఠశాల ఆవరణలో పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలను పీకి, కాల్చివేసారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ ఈ మొక్క శాస్త్రీయ నామం పార్థినీయం హిస్టరో ఫోరస్ అని స్థానికంగా క్యారట్ గడ్డి, నక్షత్ర గడ్డి, ముక్కుపుడక గడ్డి ఇలా చాలా పేర్లతో పిలుస్తారన్నారు. 1956 లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుమ విత్తనాలతో పాటు ఇవి మన దేశానికి వచ్చాయని, వీటికి మొలకేత్తే సామర్థ్యం ఎక్కువ అందుకే దేశం లోని అన్ని ప్రాంతాలకు విస్తరించి ఇప్పుడో పెద్ద సమస్యగా తయారయ్యిందన్నారు. ఈ వయ్యారిభామ వలన పంటల దిగుబడిని నలభై శాతం తగ్గిస్తుందని, పశుగ్రాసంగా పనికిరాదని కానీ వీటి పుప్పొడి పశు వులు, మానవుల్లో ఎలర్జీ, ఉబ్బసం శ్వాసకోస వ్యాధులను కలిగిస్తుందన్నారు. అంతేగాక ఇవి అన్ని ప్రాంతాలలో విస్తరించడం వలన స్థానికంగా పెరిగే ఔషధ, వన్యమొక్కలు క్రమంగా కనుమరుగు అవుతున్నాయని తద్వారా మన ప్రాంత జీవవైవిద్య నాశనం అవుతుందన్నారు. అందుకే వీటి విత్తనాలు ఎర్పడక ముందే పీకి కాల్చివేయాలని, ప్రతీ ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో లేకుండా చూసేందుకే ఈ అవగాహనా కార్యక్రమమని తెలిపారు. ఎన్జీసి క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఆస్పన్న ఈశ్వరరావు , మధుబాబు, రమేష్, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధనరావు , పద్మ, చంద్రశేఖర్, యామిని, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ, కృష్ణవేణి, చిన్నారావు, లక్ష్మిబాయ్, విష్ణాచారి, కోటేశ్వరరావు, రవితేజ, తులసిరాణి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పండగ

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆ దేశాల మేరకు కూటమి ప్రభుత్వం ప్రతినిధులు మండలంలో ప్రతి గ్రామంలో సామాజిక పెన్షన్ పండగ వాతా వరణంలో నిలిచింది. ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ మండల కేంద్రమైన పొందూరులో వాడవాడలా సుడిగాలి పర్యటన చేశారు. పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య పసుపు స్కూటర్ తో హుషారుగా జనం ముందు దూసుకుపోయారు. కూనకు బడుగు బలహీన వర్గాల నివసించే వాడల్లో ప్రజలు ఆప్యాయతగా స్వాగతం పలికారు. కూన రాకకు అవ్వ తాతలు పేన్షన్ దారులు, డయాలసిస్, మైక్రో ఫైలేరియా, లేప్పర్సి రోగాలు గల, బాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పదివేల రూపాయల పెన్షన్ అందజేస్తూ వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మీకు కావలసిన మందులు సర్కారు అందిస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రి అందిస్తున్న మందులను తప్పక వాడాలని వివరించారు. సకాలంలో మీకు మందులు ఇవ్వని వారెవరైనా ప్రభుత్వ సిబ్బంది ఉంటే తమ దృష్టిలో పెట్టాలని అన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న దృక్పథంతో కూటమి సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చించి అవసరమైన మందులు అందిస్తుందన్నారు. ప్రభుత్వ చేయూతను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు ఆరోగ్యమే చంద్రన్న ధ్యేయంగా పనిచేస్తున్న దృశ్య ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి నాయుడు, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగ నాయకులు (చిన్న రంగా) మండల ప్రధాన కార్యదర్శి వందాన మురళీకృష్ణ, మండల టి ఎన్ టీ యు సి నేత మొకర సత్యనారాయణ, లాయర్ రంగారావు,కాళ్ళకూరి శాంతారామ్,ఎంపీటీసీ అనకాపల్లివాణి,అనకాపల్లి భవాని,లచ్చుబోతు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు దండా శ్రీనివాసరావు, కాలెపు శ్రీనివాసరావు, పోలాకి బాలకృష్ణ, అనకాపల్లి కృష్ణ, కొండల రాజారావు, లచ్చుబోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 10,765 పింఛన్‌దారులకు పెన్షన్‌లు పంపిణీ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలో సుమారు 10,765 మంది పింఛన్ దారులకు సుమారు రూ.10.70 కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎమ్మెల్యే, బగ్గు రమణ మూర్తి అన్నారు. శనివారం ఆయన మండలంలో కిళ్ళాం గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులను దృష్టిలో పెట్టుకొని, రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్ళి పింఛన్లు లబ్ధిదారులకు అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, వెంకటరావు, తహశీల్దార్, టి.సత్యన్నారాయణ, ఎంపిడివో, బి.మధుసూధనరావు, పంచాయితీ సర్పంచ్, ఆర్.బోడి రామన్న, ఉప సర్పంచ్, పి.సత్యన్నారాయణ, టీడీపీ ప్రతినిధులు, శిమ్మ చంద్రశేఖర్, జనసేన ప్రతినిధులు వైద్య, ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీపీఎస్ పై ఏపీటీఎఫ్ నిరసన

విశాలాంధ్ర - పలాస : సిపిఎస్ విధానం ఆంధ్రప్రదేశ్ లో 1సెప్టెంబర్ 2004 లో ప్రవేశ పెట్టబడి, రెండు దశాబ్దాలైన నేపథ్యంలో పాత తాలూకా కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్పిస్తే మరేది తమకు ఆమోదయోగ్యం కాదనే విధానానికి ఏపీటీఎఫ్ కట్టుబడి ఉందని, కనుక ఆదివారం ఉదయం 9.30 గంటలకు సోంపేట, కంచిలి, మందస మండలాలకు చెందిన సిపిఎస్ ఉద్యోగులు అలాగే సిపిఎస్ ను వ్యతిరేకించే ఇతర ఉద్యోగులు మరియు పెన్షనర్లు ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఇతర ప్రాంతాల్లో ఉండే ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారికి సమీపంలో ఉండే పాత తాలూకా కేంద్రాల వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు, మందస మండల శాఖ అధ్యక్షులు యస్ కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె. సుందర రావు, కార్యవర్గ సభ్యులు యస్ గణేశ్వర రావు,యం. చిత్రసేను మరియు ఉపాధ్యాయులు యస్ అబ్రహం, పి. రాంబాబు, యం. దామోదరం, జి. గోపాల కృష్ణ,బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు యు.పి.ఎస్ సమ్మతం కాదు

యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బి.శ్రీరామమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న యుపిఎస్ గాని, సిపిఎస్, జిపిఎస్ రాష్ట్ర ఉద్యోగులకు సమ్మతం కాదని, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బమ్మిడి శ్రీరామ మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆవరణలో యుటిఎఫ్ ప్రతినిధులు యుపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేని ఓపిఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్, టి.సత్య న్నారా యణకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవా ధ్యక్షుడు, కోరాడ వైకుంతరావు, కార్యవర్గ సభ్యురాలు, రాజాపు దమయంతి, కే.ఆది నారాయణ, పి.ఉమాభాస్కర్, ఎస్.రాజేష్, ఏ.ఆర్.భూషణ్, సునీల్‌గౌతమ్, తిరుమలరావు, సిహెచ్.రమణ, కామేశ్వరరావు, పోలాకి మండల ఏపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి, సిహెచ్.ధర్మారావు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో ముగిసిన జాతీయ సెమినార్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్మెంటు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శనివారంతో ముగిసింది. డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంటు అనే అంశంలో వ్యూహాలు, సవాళ్లు అనే విషయంపై సెమినార్ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపకులు, వక్తలు పరిశోధనా అంశాలపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. అనూరాధ, సెమినార్ కన్వీనర్ కె.అచ్యుతరావు, కో కన్వీనర్ డి.చక్ర పాణి, అధ్యాపకులు ఎన్. సంతోష్ రంగనాథ్, కె.ఉదయకిరణ్, టి. భవానీ పాల్గొన్నారు.

రూ.2.55 కోట్లతో నిర్మాణమవుతున్న 'ఇండోర్ స్టేడియం'..ఫ్లోరింగ్ పూర్తయితే ప్రారంభానికి సిద్ధం

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో ఆర్.టి.సి కాంప్లెక్స్ ఎదురుగా వున్న నరసన్న చెరువు సమీపంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. సుమారు 2.55కోట్లతో నిర్మాణం అవుతున్న స్టేడియంలో ఫ్లోరింగ్ పనులు పూర్తి కాకపోవటంతో ప్రారం భానికి అలస్యమవుతోంది. నియోజక వర్గంలోని క్రీడాకారులు తమలో వున్న ప్రతిభను మరింత వెలుగులోకి తెచ్చేందుకు ఈ ఇండోర్ స్టేడియం ఎంతగానో ఉపయోగం కానున్నది. 2014వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం నిర్మాణం చేయాలని ఆలోచన చేశారు. దీనిలో భాగంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్స హించాలనే ధ్యేయంతో అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి నరసన్నపేట నియోజకవర్గానికి ఇండోర్ స్టేడియం అవసరమని, నాటి ముఖ్యమంత్రి, చంద్రబాబుతో నరసన్నపేట పట్టణానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేయించారు. ప్రస్తుతం స్టేడియంలో ఫ్లోరింగ్ నిర్మాణానికి రాష్ట్ర స్థాయి అధికారులకు సుమారు రూ.40లక్షలుతో ప్రతిపాదనలు పంపించటం జరిగింది. అయితే ఫ్లోరింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవటంతో స్టేడియం ప్రారంభోత్సవానికి నోచుకోవటం లేదు, ఈ విషయమై డి.ఎస్.డి.ఓ, శ్రీధర్ విశాలాంధ్రతో మాట్లాడుతూ బాల్‌బ్యాట్‌మెంటెన్, టేబుల్ టెన్నిస్‌తో పాటు పలు క్రీడలు ఆడేందుకు స్టేడియం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే స్టేడియంలో కొంత భాగం ఉడ్‌తో ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తే, వెయిట్ లిఫ్టింగ్ కూడా ప్రాక్టీస్ చేసుకోవచ్చని అన్నారు. స్టేడియంలో ఫ్లోరింగ్ పూర్తయితే కొద్ది రోజుల్లో ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి నోచుకుంటుందని తెలిపారు.